దీపాలు వెలిగించారు. యజమాని గృహంలో కూడా అదిగో! దీపం! ఆయన మూడు రోజుల్నుండీ అస్వస్థుడై మంచం పట్టివున్నాడు. ఇల్లు విడిచి ఎక్కడికీ పోలేదు. అతనికి పరిచర్య చేసేందు కెవరైనావున్నారో లేదో. తాను బజారుకి వచ్చేవాడు. సహాయం దీపమే.

రామదాసుకి ఉదీచి శ్రేణి దీపం అవుపించలేదు. "ఇంత చీకటైనా, సంపంగి దీపం ఎందుకు వెలిగించలేదో! బహుశా మధ్యాహ్నం నిద్రలో వుండి వుంటుంది. కొంపంటే ఎక్కడికిపోతుంది? పొరుగిళ్ళకు వెళ్ళదు. అసలెన్నడూ గుమ్మం దిగి ఇవతలకి రాదు."

గృహ బహిర్ద్వారం దాటి ఒక్కడుగు లోనికి వేశాడు. కళ్లు తిరిగి నట్లయింది. శరీరమే పరిభ్రమిస్తూంది. ఏమిటది?

సంపంగి మంచి పిల్ల. అంత మంచి పిల్ల యజమాని లోగదిలో నుండి వ్యత్యస్త కేశాలతో పమిట సర్దుకుంటూ బయటికి వస్తున్నది.

"ఎందుకక్కడికి పోయావ్?" అని గద్దించి అడిగాడు సంపంగిని.

"యజమానికి నీరు కావలసి వస్తే అందివ్వడానికి వెళ్ళాను. వెళ్ళక తప్పింది కాదు!" అన్నదే సంపంగి సమాధానం

దుకాణదారు నవ్వు ప్రతిధ్వనించింది మళ్ళీ రామదాసు అత్యుష్ణ కర్ణాల్లో.

కథానిక

ఊరేగింపు

యం. సూరి

రామిగాడు సిపాయిల్లోగుండా యింటికి చేరక ముందే వుత్తరం ముక్క ఒకటి చేరింది. దానిలో "నేను వచ్చేటప్పటికి ప్రక్కవూరి పల్లెలోని 'ఈరిని' పెండ్లాడేందుకు మంచిచెడ్డలన్నీ మాట్లాడండి. వాడుకలో వున్న పేర్లకు బదులు రామయ్య, ఈరమ్మ అని వివాహ మహోత్సవ ఆహ్వానపత్రాలు అరవెయ్యి దనుక అచ్చు వేయించండి. పైసల్లో ఏమాత్రం పిక్కకుండా పేరుగన్న మేళగాండ్లను మాట్లాడటము, వూరేగింపుకు ఒక్క మోటారు టాక్సీ, పైన పూలపాలిక కుదిరించాలి. నేను వచ్చేటప్పుడు బనారసు పట్టణం నుండే బట్టలు ఖరీదు చేస్తాను. ఆరుమూడైనా, మూడు ఆరైనా పల్లెలోనే కాకుండా కాపులిండ్లల్లో సహితం తూర్పున కరకర పొద్దు పొడిచిందాక వూరేగాల్సిందే" అని వుంది. ఇది వినేటప్పటికి తలిదండ్రుల గుండెలు గుభేలుమన్నాయి. కొడుకొస్తాడని సంతోషించినా వూళ్ళో వూరేగింపు అనే వాక్యం వింటంతోటే వులిక్కి పడి, వుక్కిరి బిక్కిరయ్యారు. అందరి ఆగ్రహాలకు ఆహుతి అవుతామేమోనని ఆందోళన చెందుతున్నారు.

రామిగాడి జాబుముక్క పల్లెలోని కుల పెద్దల చెవుల్లో పడింది. తమకేం తెలియకుండా నిర్ణయించుకున్నందుకు నిప్పయ్యారు. ముందుగా ఏమాటా తమతో చెప్పనందుకు మండిపోయారు. "సిపాయిల్లో కెళ్లి కొత్త తెల్లపుల్లగా వుంటేమాత్రం పొగరుమోతు తనం సాగుద్దా? పూర్వకాలం నుండి లేని పెండ్లి సంబంధాలు వూర్లో అడుగుపెట్టటం ఏటికి ఎదురీదటమే అవుతుంది. ఇది మితం తప్పిన మిడిసిపాటు కాకపోతే మంచికా? పొద్దున లేస్తే కాపుల కనుసన్నల్లో బ్రతికేవోళ్లం" అనుకొని రామిగాడి తండ్రిని పిలిచారు.

"ఏందిరా! నీ కొడుక్కేమైనా మిల్టరీలో మిగిలినదాంతో ఏమన్నా మంపెక్కిందా ఏం? తాత తరాలనుండి ఆచారం కానిదానికి అందవేసి అడ్డంగా నడిస్తే కాపులకు కోపంరాదూ? కాపుల కోపతాపాలతో పల్లెలో కాలు నిలపగలమా? మనకేమైనా పరుగుల పొలాలన్న

వుంటే ఫరవాలేదనుకోవచ్చు. ఇది మీ ఒక్కరికే కాదు, పల్లె అసాంతానికే అపవాదుతో పాటు ఆపద వచ్చుద్ది. వాడొచ్చినాక అందరం చెప్పినామని చెప్పి అదరిపాట్లన్నీ ఆపు చేయించు" అని ఆజ్ఞాపించారు.

ఇక పల్లెలోని పడుచుకుర్రాళ్ళంతా రామిగాడి జాబుకు జేజేలు కొడుతున్నారు. అసలు రామిగాడు వస్తున్నాడంటేనే పట్టరాని సంతోషాలతో పొంగిపోతున్నారు. పెండ్లి సంబరాన్ని సాగించేందుకు చావుకైనా సై అంటూ సవాళ్లు కొడుతున్నారు. ఈ దెబ్బతో ఎదురు వచ్చినవాడినల్లా తిరగేద్దామనుకుంటున్నారు. ఈ అదనుతో అంటరానివారని విధించిన బంధనాలన్నీ ఛేదిద్దామనుకొన్నారు. "అదీకాక కాపులంతా కయ్యానికి కాలు దువ్వుతారంటే అది లేదు. కుర్రవారంతా కులాల కట్టుబాట్లన్నీ కాలదన్నుతూ కలసే వస్తున్నారాయె. పొలాల పనుల్లో పల్లెత్తు మాటాడక మాలమాదిగలతో మంచిగా వుంటున్నారాయె. ఒకటీ అరతో పొద్దస్తమానం బండచాకిరీ చేసి బతుకుతున్న బక్క రైతులు బడాయిలకు బయటకే రారు. మానసానికి మగ్గి మనతో మంచిగుంటానికి గోడమీద పిల్లివాటంగా వుండే నోటికీ చేతికందని చిన్న రైతులు చెంతకే రారు. ఇంక ఆ ఒక్క మాధవయ్యే, ఆయన మాటను భుజాన వేసుకొనే ఆ పదిమంది ఎంత ఎదురు కంచెలు వేస్తే మాత్రం చెలగయ్యాక చూస్తామట్రా" అనుకొని రామిగాడి రాకకు ఎదురు చూస్తున్నారు.

రామిగాడు ఈ రోజు సిపాయిల్లో చేరాడుగాని ఆరోజుల్లో ఆరకుండా వెలిగిన మొనగాడు. పల్లెనంతటిని కులపెద్దల కట్టుబాట్లను లెక్కచేయక ఒక్క తాటిన నడిపిన తెగువ కలవాడు. అసలు రామిగాడి పేరు వింటేనే మోతుబరు లందరికీ ముచ్చమటలు పోసేయి. రానురాను పని పాటలు పల్చబడి మగ్గంమీద పడుగేసేందుకు కూడా పని లేకుండా పోయింది. మంచిరోజు లొస్తాయని వార్తలు విని ఆశించారు. కాని ఆరోజు కారోజు ఆశలు అరగిపోవటమేగాని పెరిగే పాలకలైనా కనబడలేదు. నూలు ధరలు నిచ్చెనకైనా అందకుండా నిలువునా పెరిగిపోయాయి. వచ్చే అరపెట్టి నూలులో నేద్దామంటే నూకలైనా వచ్చేయి కాదు. దొంగమార్కెట్టులో మూరి నేసినా మిల్లుబట్టకన్నా అంతులేని ధరపడి అందరికీ అందకుండా అయింది. అంతకీ అదే స్థితిలో వుంటే, పుటిక్కిన ప్రాణం పోయిందా. పాపం అని ఐనా అనకుండా "జబ్బుతో చీకిచీకి చచ్చాడు లే" అంటారు. అందుకని చివరకు చేతికందని పనై, నోటికందని తిండి అయి పొట్ట మాడ్చుకోలేక మిలిటరీలో చేరాడు. అక్కడకూడా ఆళ్ళ మాటకూడా ఖాతరు చేయటంలేదని ఇన్నాళ్లు పాటు వుంచి ఇంటికి పొమ్మన్నారు.

రామిగాడు రాసిన పలుకు పల్లెనుండి ఛెంగున చిందేసి వూర్లో వూడిపడింది. మూడొందల ఎకరాల మోతుబరి మాధవయ్యకు కూడా తెలిసింది. వల్లసాంతం వుడికిపోయి నిప్పుతొక్కిన కోతిలా చిందులు తొక్కాడు. రామిగాడి రాకన్నంతనే వల్లంతా జర్రులు పాకినట్లయి జలదరించింది. మిలిటరీలో వుంటేనన్నా ఏ కొరియారంగానికో అంపేవాడినను కున్నాడు. ఊరేగింపును వూరికే వదిల్తె వుపయోగం లేదనుకున్నాడు. "ఈ దెబ్బలో ఒక్క పనికి రెండు ఫలితాలన్నట్లు" వూర్లో బీదాబిక్కను "పొదిగిన కోడి క్రిందకు పిల్లల్లాగ" చంకక్రిందకు చేర్చుకుందామని, కదిల్తె కూలి పెంచండని కేకవేసి ముందు నిలబడే మాలమాదిగలను పచ్చాకు పసరు పిండినట్లు పిండుదామనుకున్నాడు. కాపులందరితో కలసి మాట్లాడేందుకు రచ్చబండకాడ సభ జరిపేందుకు కార్యక్రమం నిర్ణయించుకున్నాడు.

మాధవయ్య అంటే సామాన్యుడు కాదు, వూర్లోకి వచ్చిన ఆఫీసర్లందరిని అన్ని హంగామాలతో ఆదరించి అందినన్ని హోదాలు తగిలించుకున్న పెదకాపు. ప్రాంసరినోట్లను పదింతలయినా పెంచి దీపాలార్పటంలో దిట్టయిన చెయ్యి. అరిచేతిలో స్వర్గాలుచూపి పొద్దస్తం బండచాకిరి చేయించుకొని పైసల్లో పెనుగులాడే పిసినిగొట్టు. మాట్లాడితే బందిఖానాలో వేయిస్తానని భయపెట్టటంలో బహుమేటి. అందుకే అందరి ఛీదరింపులకు గురి అవుతూ

చివరకు పదిమందిని పట్టుక వెళ్లాడుతున్నాడు.

మాధవయ్య రచ్చబండ కాడ సభకురమ్మని పెండ్లి పిలుపులాగా ఇంటింటికి పిలుపు అందించాడు. చీకటిపడటంతోటే పిల్ల బీరుపోకుండా పిలచినచోటికి చేరారు. పెదకాపులైన పదిమంది రచ్చబండపై కూర్చొని పిడిమూరెడు పొరచుట్టల పొగలు గుప్పిస్తున్నారు. అంతలో మాధవయ్య ముందు నిలబడి "పల్లెలోని పెండ్లి పూరేగింపు వూర్లో వూరేగుద్దంట, పూటకు గంజిలేని గాడిదకొడుకులకు బతికేరోజులు లేకగాని బాగుపడేందుకా? రామిగాడు మిలిటరీలో మినుగుతున్నా ననుకున్నా డేమో! పొట్టకులేక పట్టణాల్లో తిరిగి నాలుగుముక్కలు నేర్చుకున్నంతమాత్రాన కులాలన్నిటినీ కలగా పులగం చేద్దామనుకుంటే ఎట్లా? చిన్న పెద్ద, కాపు, కరణం అనకుండా కన్నుమిన్ను కన పడకుండా కవాతు తొక్కటం అనుకున్నాడల్లె వుంది. కదిత్తె వూర్లో కాలుబెట్టాలి. మెదిత్తె మన పొలాలకు మేతకు రావాలి. నూర్పిళ్ళ తిరిపాల కాడనుండి ఆఖరికి తొలకరింపు తొలినాట్లవరకు మన మోచేతి క్రింది నీళ్లుతాగి బ్రతకాలిసినవాళ్లు వూర్లో వూరేగుతామని అందవేయటం కాపులపై కంకణం కాక మరేంకాదు. మనం దీన్ని గాంగ దిగ విడిచామా వాళ్ళపెండ్లికి మనం ఇస్తళ్లు ఎత్తాలిసిందే. మనకు నిజంగా చీము రక్తం వుంటే వూరేగింపును అడ్డగించాల్సిందే." అని ఆ మాటా ఈ మాటాతో అర్ధరాత్రి చేశారు. చివరకు ఒక్క చిక్కు ఎదురైంది. "దీనికి అందరికీ సమ్మతమేనా" అంటే చప్పట్లచప్పుడి లేకపోతే చవుకగా వుంటుందని "నేను చెప్పిన సంగతులన్నీ సమ్మతంకాని వాళ్ళంతా చేతులెత్తండి" అని ముగించాడు. మధ్య తరగతి రైతులంతా మతాచారాలన్నీ మంటగలిసి, మాలమాదిగల మాట చెల్లుబడి అవుద్దని చిరచిరలాడి పెదిమలు కొరుక్కున్నారు. దెబ్బలాటకు దిగితే వున్న సంసారాలన్నా వుండకుండా మొదలే మెతుకులేని మోసం అవుద్దనుకొని "తప్పకుండా అడ్డగించండి" అని మాధవయ్యకు అండగా అరిచారు. బక్క రైతులు ఏ బరవాసాలు ఇయ్యకుండానే ఇంటి మొఖం పట్టారు. ఇదంతా మాధవయ్య మంత్రం తప్ప మరేం కాదనుకున్నారు. వూరేగింపు వచ్చినంతమాత్రాన మన మూట ముల్లెలు, పరువు ప్రతిష్ఠలు పాడయ్యేది ఏమి లేదనుకున్నారు. పెండ్లి పేరుచెప్పి మాధవయ్య తన పెత్తనానికి పగ్గాలు లేకుండా సాగించేందుకే ఈ సభ అంతా అనుకున్నారు. పేదాళ్ళలో పేచీలు పెంచి లాభాలు పోగు చేసుకునేందుకే ఈ ప్లాను అనుకొని ఇండ్లకు చేరారు.

రామిగాడు పక్కనేవున్న రైలుస్టేషనులో దిగి గుర్రపు బండిపై పరుగులమీద పల్లెకు చేరాడు. చేరటంతోటే పల్లెలోని పిల్లా, జెల్లా, ముసలా ముతకా అంతా పోయి పలకరించి వచ్చారు. యువకులంతా వుత్సాహంతో వుప్పొంగిపోతున్నారు. తమ జతగాని పెండ్లి జంజామృతంగా జరపాలనుకున్నారు. జరిగిన సంగతులన్ని సందుపోకుండా రామిగాడి చెవుల్లో పోశారు. తలితండ్రులు వూరేగింపు సంగతెత్తి "ఒరే రామిగా! చేసేదేదో పల్లెలోనే సేస్తే ఏ పగలూ లేకుండా వుంటాయిగా? కాని దానికి కాలుదువ్వతే కయ్యానికి కారణమౌతాంరా!" అన్నారు.

ముసలాండ్ల మాట వినటంతోటే రామిగాడు మండిపడ్డాడు. వీళ్ళకు,కుల పెద్దలు నూరిపోసిన పిరికి పానకమే ననుకున్నాడు. "వూర్లో వూరేగితే మన మెడలు తీసి మొలకలేస్తారా ఏం? మాధవయ్య మాటలకు నోరు మెదపక పోతే తప్పకుండా మెడలువిరుస్తాడు. ఏమన్నా జరగనీ, ఈ దెబ్బతో పెండ్లి వూరేగింపో, లేక కాటికి కదలింపో, కానియ్యాలసిందే" అన్నంతనే ముసలాండ్లు మరి మాట్లాడలేకపోయారు.

పెండ్లి ప్రయత్నాలు సరసరసాగుతున్నాయి. అచ్చు గుద్దించిన అరవేయి ఆహ్వాన పత్రాలు అందరకు అందించాడు. పక్క బస్తీనుండి అద్దెకు మంచి మోటారు టాక్సీ, దానిమీద తళుకు మెరుపులతో మెరిసే పూసలు పొదిగిన పూలిపాలిక, పాలికకు ముందుగా నాజూకైన పోజుల బొమ్మలతో సహా తెచ్చారు. మేళగాండ్లంతా మాలిండ్ల పెండ్లికి రావటానికి ముందు జంకినా పైసల పెచ్చుని చూచి పరు

(తరువాయి 7వ పేజీలో చూడుడు)